# మినీ కథ

## కక్కుర్తి



"బొత్తిగా ఈ రోజుల్లో ఎవరికి నిజాయితీ ఉండటంలేదు" విసుక్కున్నాను నాలో నేను.

అసలు ఏం జరిగిందంటే, పొద్దున కూరలవాడికి రెండురూపాయలనోటు ఇచ్చి ఒక అరకిలో వంకాయలు తీసుకున్నాను. సరిపోయిందన్నాడు కూరలవాడు. అదేం టయ్యా అంటే నేను రూపాయినోటు మాత్రమే ఇచ్చానంటాడు. గట్టిగా అడిగితే నోటికి వచ్చినట్లు వాగి వినిపించుకోకుండా పోయాడు. వాడేమన్నా బాగుపడతాడా అసలు ? !

భోజనం చేసి ఆఫీసుకి బయలుదేరాను. సందు మొగలో ఉన్న కిళ్ళీకొట్టుదగ్గర ఆగి సిగరెట్ తీసుకున్నాను. రూపాయినోటు ఇచ్చాను కొట్టువాడికి. చిల్లర తిరిగిఇచ్చాడు. అర్ధరూపాయి కాసు అనుకుని రూపాయికాసు ఇచ్చాడు.

"ఏమయ్యా ? ఎంత చిల్లర ఇచ్చావు ?" అడిగాను

వాడు నా చేతిలోని డబ్బులు చూసాడు. నాలిక కొరుక్కున్నాడు. రూపాయికాసు తీసుకుని అర్ధరూపాయికాసు తిరిగిఇచ్చాడు.

"మీరు మంచివారు బాబూ !" మెచ్చుకున్నాడు.

గర్వంతో నా ఛాతీ వెడల్పయింది. కాదు మరీ ! !

ఒక చిరునవ్వు కొట్టువాడివైపు విసిరి ముందుకి కదిలాను. ఆటోను పిలిచి ఎక్కి ఆఫీసుకి వెళ్ళాను. ఆఫీసులో ఆరోజంతా చాలా బిజీగా గడిచిపోయింది. మా కంప్యూటర్ కాస్తా పనిచెయ్యడం మానేసింది. రోజంతా ఆ గొడవల్తో సతమతమయ్యాను.

టైం ఆరయింది. ఆఫీసు వదిలి ఇంటికి కదిలాను. మా ఆఫీసులో తెలుగు మాగజైన్ క్లబ్ ఒకటి రన్‌చేస్తూ ఉంటాం. కావల్సిన పుస్తకాలు కొనటం అవీ నేనే చేస్తూఉంటాను. గత వారంరోజులుగా ఊర్లో లేకపోవటం వల్ల అసలు పుస్తకాలు కొనలేదు. ఆ షాపు ఇంటికి దగ్గరగానే ఉంది. షాపుకు బయలుదేరాను.

"రండి సార్ ! ఊర్లో లేరా ఏమి ? మీకోసందా పుస్తకాలన్నీ ఎత్తిపెట్టాను" అన్నాడు షాపతను.

షాపతను అరవ తెలుగువాడు. అతని నోటిలో తెలుగుభాష ఖూనీ అయిపోతూ ఉంటుంది

సమాధానంగా బుర్ర ఊపాను. అతను ఇచ్చిన పుస్తకాలన్నీ తీసుకుని ధర మొత్తం లెక్కపెట్టి నూరునోటు ఇచ్చాను. షాపతను అందించిన చిల్లర తీసుకుని లెక్కపెట్టాను. పదిరూపాయలు ఎక్కువిచ్చాడు. నాలోని నిజాయితీ నన్ను వెన్ను తట్టింది. పదిరూపాయలు ఎక్కువిచ్చావంటూ డబ్బు వాపసు చేసాను. షాపతను కృతజ్ఞతగా చూసాడు.

"మీరుదా మంచివాండ్లు సార్ !"సంతోషం వెళ్ళబుచ్చాడు.

ఒక మందహాసం విసిరి ఇంటికి దారి తీసాను. ఇల్లు చేరగానే శ్రీమతి నవ్వుతూ ఎదురు వచ్చింది.

కాఫీ, టిఫిన్లయ్యాక నా నిజాయితీ నిరూపించే సంఘటనలు చెప్పాను. శ్రీమతి నవ్వింది.

"అవి సరేగానీ, మీ నాన్నగారి దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. మిమ్మల్ని వెంటనే వెయ్యిరూపాయలు పంపమన్నారు. ఇల్లేదో బాగుచేయించాలిట" చెప్పింది.

అలాగేనన్నట్లు బుర్ర ఊపాను.

మర్నాడు పొద్దున్నే తొందరగాలేచాను. మొదట బాంకుకి వెళ్ళాలికదా మరి !

బాంకులో రష్ ఎక్కువగావుంది. కౌంటర్‌లో చెక్ ఇచ్చి టోకెన్ తీసుకున్నాను. నా నెంబరు పిలవగానే కాష్ కౌంటరు దగ్గరకి వెళ్ళాను.

"అన్నీ వందరూపాయలనోట్లుఇవ్వండి" చెప్పాను.

కాషియర్ బుర్ర ఊపి వందరూపాయల నోట్లు అందించి నెక్స్ట్ నెంబరు పిలిచాడు.

కొంచెం ఇవతలగా వచ్చి నోట్లు లెక్కపెట్టుకున్నాను. పదకొండున్నాయి. కొంచెం ఆశ్చర్యం వేసింది. మళ్ళీ లెక్కపెట్టాను. నిజంగానే పదకొండున్నాయి. కాషియర్ పొరపాటున ఒక నోటు ఎక్కువిచ్చాడు. అంటే వందరూపాయలు !

నా గుండె లయతప్పింది. కాషియర్ వైపు చూసాను. అతను చాలా బిజీగా ఉన్నాడు. వందరూపాయలంటే మాటలా ?! ఈరోజు చాలా అదృష్టమయిన రోజు ! వెంటనే గబగబా బయటికి నడిచాను. *

(నీతి : ఒక రూపాయికీ, పది రూపాయలకీ కక్కుర్తి పడనివాళ్ళందరూ నిజంగా నిజాయితీపరులు అయివుంటారనుకోరాదు.)



- జె.యు.బి.వి. ప్రసాద్
ఆర్ & డి హిందుస్తాన్ కంప్యూటర్స్ లిమిటెడ్
4-హడ్డోస్ రోడ్, నుంగంబాకం
మద్రాసు - 6

### ఫర్ యువర్ ఇన్‌ఫర్మేషన్

ఎవరో చెప్పుకోండి

1) మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడు
2) మొట్టమొదటి చైనా ప్రెసిడెంట్
3) మొట్టమొదటి ఇండియా అధ్యక్షుడు
4) మొట్టమొదటి ఇండియన్ యూనియన్ గవర్నర్ జనరల్
5) మొట్టమొదటి ఫీల్డ్‌మార్షల్
6) మొట్టమొదటి మహిళా ప్రెసిడెంట్
7) ఎవరెస్ట్ శిఖరాన్ని రెండుసార్లు అధిరోహించినవారు

పంపినవారు : జి. హెచ్. వి. ప్రసాద్ (ఒంగోలు)

సమాధానాలకోసం 30వ పేజీ చూడండి